
# సుబ్రమణ్యం ఆలోచనలు పెడబాటు

— కాకాని కమల



''నాన్నా!''

నేను ప్రేమించిన కిశోర్‌తో కల్సి వెళ్ళిపోతున్నాను. ఈ ఉత్తరం మీకు అందే సమయానికి మీకు మేం కొన్ని వందల మైళ్ళ దూరంలో ఉంటాము. వేలకి వేలు కట్నాలు గుమ్మరించి అల్లుళ్లని కొనే శ్రమ మీకు తప్పించినందుకు నిజానికి మీరు నన్ను అభినందించి వుండాలి. కాని ఆ పని మీకు చాతకాదు నాన్నా. అందుకే నేను ఈ నిర్ణయం తీసుకున్నాను. కిశోర్‌కి మీరు ఆశించినట్లు గొప్ప గొప్ప డిగ్రీలు లేకపోవచ్చు. నిరుపేద కావచ్చు. కాని మాకు ఆత్మ విశ్వాసం వుంది. అదే పెట్టుబడిగా పెట్టి లక్షలు ఆర్జించుకోగలము. కిశోర్ దగ్గర వ్యాపారం చెయ్యగల నేర్పు, ఓర్పు ఉన్నాయి. మేం ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాతే తిరిగి మీ ఇంటికి వస్తాము. నా గురించి బాధ పడకండి చాతనయితే ఆనందించండి.

మీ కుమార్తె
శ్రీవల్లి

ఉత్తరం చదివిన కాంతమ్మ రుసరుసలాడుతూ కాగితాల ''పేడ్ ''ని టేబిల్ మీదకి గిరాటేసింది.

పక్కనే కుర్చీలో వేడి కాఫీ చప్పరిస్తూ సిగరెట్టు పొగల్ని రింగురింగులగా గాల్లోకి వదుల్తున్న భర్త మీద మండిపడుతూ-

''ఏమిటండీ? ఈ వెధవరాతలు? కొత్తపుంతలు అంటూ పేరుపెట్టి కథల్లో రాసేవి ఇవా? ఇవి కొత్త పుంతలు కావు. మత్తు పుంతలు. రేపు ఈ కథ పత్రికలో అచ్చయి అందరితోపాటు మన అమ్మాయి కూడా చదివితే?''

సుబ్రమణ్యం కళ్ళు ముడిచాడు.

''చదివితే ఏం?'' అన్నాడు.

''చదివితే ఏమా? నా పిండాకూడు. మనమ్మాయి కూడా ఇలాగే ఎవడ్నో తీసుకుని ఇంట్లోంచి లేచక్కాపోతుంది!''

సుబ్రమణ్యం నవ్వాడు.

''వేలకి వేలు కట్నం ఇచ్చే బాధ తప్పుతుంది. తనకి నచ్చిన వాణ్ని అది ఎంచుకుంటుంది. కాలం మారటంలే?'' అన్నాడు.

''నా బొంద. కాలం ఎందుకు మారటంలేదు. మారింది. కాని మీరు కథల్లో రాసినంత గొప్పగా మాత్రం కాలం మారలేదు. మీరు కాగితాల్లో రాసే ఆదర్శాలన్నీ ఇంకా బతుకుల్లోకి రాలేదు. కాలం ఎంత మారినా గొల్లై గొల్లైలాగే ఉంది. పులిపులిలాగే ఉంది. దీని వెర్రితనం పోయిందా? దాని క్రౌర్యం తగ్గిందా?''

సుబ్రమణ్యం కనుబొమ్మలెగరేశాడు.

''అలా అని ఎందుకనుకుంటున్నావ్?''

కాంతం మెటికలు విరిచింది.

''ఎందుకనుకోవటం ఏమిటి? కళ్ళతో చూస్తున్నాం గనక. కథల్లో అయితే తల్లి తండ్రిని కోట్ల ఆస్తిని, అంతస్తుని కూడా వదులుకుని ప్రేమించిన అమ్మాయి కోసం నిలబడినట్లు నీతి ముడిపెట్టి రాస్తారు. కాని నిజజీవితంలో అంత నిజాయితీ ఎక్కడేడిసింది? అంతెందుకు? ఆ రోజుల్లోనే మీ నాన్న మా నాన్న దగ్గర పదివేలు కట్నం తీసుకున్నాడు. పెళ్లి సమయానికి మూడు వేలు తక్కువయితే మధ్యవర్తులు నచ్చచెప్పాక ఆ మూడు వేలు ఇచ్చాకనే పిల్లని తీసుకెళ్ళే షరుతు మీద తాళికట్టనిచ్చాడు'' కాంతం ఎకసెక్కెం చేసింది.

సుబ్రమణ్యం పెదవులు చప్పరించాడు.

''నువ్వు చెప్పింది నిజమే. అప్పట్లో నాకు ఆదర్శాలున్నాయి గాని స్వతంత్రం లేదు...

''ఏం మాయ రోగం? పెళ్ళి నాటికే కథలు గిలకటం మొదలుపెట్టారు, గవర్నమెంటు ఉద్యోగం ఉంది.''

''నిజమే. కాని ఆ రోజులు వేరు. ఇప్పుడు కాలం మారలేదూ?''

''మనకి చేతకాని పన్లు ఇతరుల మీద రుద్దటం మొదటి తప్పు. మీ కంటె ముందుకాలం వాడైన గాంధిగారు ఏమన్నాడు. చెప్పకు-చేసి చూపించమన్నాడు. అయినా కాలం మారింది, మారింది. అనటమే గాని ఏం మారింది?....

''మొన్నటికి మొన్న... మెరక వీధిలో సీతారామయ్యగారి కూతురి గతి ఏమయ్యింది? వాడెవడో ఎర్రగా బుర్రగా వుండి ప్రేమ దోమ అనేసరికి ఆ పిల్ల నమ్మి వాడి వెంట పోయింది. ఆరునెల్ల తరువాత దిష్టిబొమ్మలా తిరిగి వచ్చింది. ఆ ప్రేమించిన వాడు ఈ పిల్ల వంటిమీదున్న బంగారం, వెంట

తెచ్చిన సొమ్ము కరిగించి పిల్లని ఒంటరిగా హోటలు గదిలో ఒదిలేస్తే అప్పటికి వాళ్ళ తల్లితండ్రి జ్ఞాపకం వచ్చారు దానికి.

''పదిమందిలో పరువుపోయి, ఇంటికి వచ్చిన కూతుర్ని తిరిగి వెళ్ళగొట్టలేక ఊరు ఒదిలి పోయాడు ఆ పెద్ద మనిషి.

''అంతెందుకు? నిర్మల... అదే... మీ పెత్తల్లి కూతురు బతుకు మాత్రం? పెద్దల్ని కాదని ప్రేమంటూ వెంపర్లాడి, కాలేజీకని చెప్పి అట్నుంచి అటే ప్రేమించిన వాడితో ఎటో వెళ్లి పోయింది. రెండు సంవత్సరాలపాటు వాడితో ఎక్కడ తిరిగిందో ఏమయ్యిందో, ఒడిలో పసిబిడ్డతో ఒంటరిగా రెక్కలు విరిగిన పక్షిలా పుట్టింటికి వచ్చింది. దీన్ని ప్రేమించిన వాడి తల్లి తండ్రి దీన్ని వెళ్ళగొట్టి కొడుకుని ఇంటికి తీసుకెళ్ళిపోయారు. పదిమంది లోనూ కట్నంతో రంగరంగ వైభవంగా వాడికి అక్క కూతురుతోనే పెళ్ళి చేశారు. దీని పెళ్ళికి సాక్ష్యం లేదు. పదిమంది పెద్దలు లేరు. ఆ ప్రేమించినవాడే నీవెవరో నాకు తెలియదని ఆ నిర్మల ముఖం మీదే చెప్పాడు. నల్గురూ కోర్టుకి వెళ్లమన్నారు. కోర్టంటే మాటలా! డబ్బు లేకుండా పన్లు జరుగుతాయా? కాలం మారింది నిజమే కాని ఎలా మారింది.?

''కట్నం చాల్లేదని నిలువునా కాల్చేసే అత్తలు, ఆడబిడ్డలు, భర్తలు ఆ రోజుల్లో లేరు. ఈ రోజుల్లోనే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఆడపిల్ల ఒంటరిగా కనిపిస్తే ఎత్తుకుపోయి వేశ్య గృహాలకి అమ్మే రౌడీ వెధవలు, కన్నూ మిన్నూ కానకుండా ప్రవర్తించే వెధవలు కూడా ఈ కాలంలోనే కనిపిస్తున్నారు. దీనికి తోడు ఇంకా పారిపో చిలక- లేచిపో చిలకా అంటూ కథలు రాస్తారా? పైగా అది కొత్త పుంత అని చెప్తున్నారా?''

కాంతం మొఖం ఎర్రగా కందింది. ఆడపిల్లల్ని కన్న బాధ ఆవిడ మాటల్లో ప్రస్ఫుటిస్తోంది.

''అయితే ఏమిటి నీగోల? ఇది కథ'' అన్నాడు విసుగ్గా సుబ్రమణ్యం.

''బాధ్యత లేకుండా- అచ్చులో పేరు చూసుకోవటం కోసం కథలు రాయద్దు అంటున్నాను. టాల్‌స్టాయ్ అంతటి వాడు సమాజంలోని లోటు పాట్లను చూపుతూ కథలు రాశాడు. అతని నవల ''రిసరెక్షన్''లో ఇటువంటి ఎన్నో నైతిక ప్రశ్నలు అడుగడుక్కీ కనిపిస్తూ వుంటాయి...

''... ఒక పొరపాటు, చిన్న తప్పు మనిషిని ఎలా తలకిందులు చేస్తుందో తప్పటడుగు జీవితాంతం వుచ్చులా ఎలా బిగుసుకుంటుందో, మోసగించబడిన స్త్రీపై మెట్టునుంచి జారిజారి కిందకి పడిపోయి మురికిలో దొర్లి బురదలో కూరుకు పోతుంటే-

''-ఆ స్త్రీని తొలిసారి మోసగించిన పురుషుడు ఈ సమాజంలో మెట్టు మెట్టు ఎక్కుతూ పై అంతస్తులో నిలబడగలిగిన గౌరవము ప్రతిష్ట పొందుతున్నప్పుడు ఈ సమాజాన్ని ఏమనాలి. సమానతకి చోటెక్కడ అని అడుగుతాడు.''

''నిజమే కావచ్చు. కాని టాల్‌స్టాయ్ ఎప్పటివాడు? ఇప్పుడు కాలం మారింది. అంటున్నాను కదా?'' సుబ్రమణ్యం చిరాకుపడ్డాడు.

అంతకంటె చిరాకుతో అంది కాంతం,

''ఏం మారింది అని నేను అడుగుతున్నాను. మీరు కథల్లో రాసినంత గొప్పగా కాలం మారలేదు అంటున్నాను. ఇరవయ్యో శతాబ్దంలో కాదు సరిక దాముప్పయవ శతాబ్ది వచ్చినా ఇప్పుడున్న పరిస్థితులుమారతాయని నేను అనుకోటం లేదు. అంతెందుకు? వీరేశలింగం ఎప్పటివాడు? నిన్న మొన్న రూప్ కన్వర్ సతీసహగమనం జరిగిందా? ఆ పిల్ల సజీవంగా నిలువునా దహించుకుపోతుంటే మీరంతాఏం చేస్తున్నారు?''

''అయితే ఏం చెయ్యమంటావ్?''

''ఇంట్లోంచి వెళ్ళిపోయిన ఆ సీతారామయ్య కూతురికేం జరిగిందో... మీ పెత్తల్లి కూతురు గతేమయ్యిందో రాయండి'' సుబ్రమణ్యం బుర్ర తిప్పాడు.

''అలారాస్తే పత్రికలు వేసుకోరు. అభ్యుదయ పథం వైపు నడిపించేలా యువతకి ధైర్యం చెప్పాలి.'' అన్నాడు సిగరెట్టు నుసి ట్రేలో విదిలుస్తూ.

కాంతం వంటికి కారం రాచుకున్నట్టు అయ్యింది. ''మీ అభ్యుదయపథం మండినట్లే వుంది. ఇంట్లో పెళ్లి కావల్సిన ముగ్గురు ఆడపిల్లల్ని పెట్టుకుని బాధ్యత లేకుండా ప్రేమించిన వాడితో లేచిపొమ్మని కథలు రాయటం''

''మరింకేం రాయమంటావ్. కాలం వాతం చూసుకుని వారం, వర్జ్యం అంటూ ముహూర్తం పెట్టి, వేలకి వేలు కట్నం గుమ్మరించి అమ్మా నాన్న చేసే పెళ్ళి చేసుకోమని చదువుకున్న అమ్మాయిలకి హితవు చెప్తూ రాయమంటావా?''

కాంతం గర్జించింది.

''కాదు. కట్నం తీసుకునే వాడ్ని పెళ్ళి చేసుకోనని, ప్రేమా దోమా అంటూ వెంటపడి మోసం చేసిన వాడి అంతం చూస్తామని సమాజంలో ఏ ఆడకూతురికి అన్యాయం జరిగినా, అది అందరికి జరిగినట్లే భావించి న్యాయం కోసం పోరాడతామని శపథం చేసినట్లుగా రాయండి.''

''ఇంకా?''

''ప్రేమ అయినా పెళ్ళి అయినా పదాసరి ఆమోదం అవసరం అని రాయండి. పెళ్ళి కాకపోయినా తన బ్రతుకు తను బ్రతకగల ఆత్మస్థయిర్యం గురించి రాయండి. ఆడపిల్లల వెంటపడి అటలు పట్టించే పోకిరి మూకలకి గుణపాఠం చెప్పినట్లు రాయండి. అంతేకాని వాస్తవానికి వాసి పూసి మారేడు కాయ చెయ్యకండి. పారిపో చిలకా లేచిపో చిలకా అంటూ చచ్చు సలహాలు ఇవ్వకండి. రచయితలంటే మేధావులని, వాళ్లు చెప్పింది పాటించటం ఆదర్శం అని నమ్మే అమాయకులు ఎంతో మంది సమాజంలో వున్నారు. మీ పిచ్చి పిచ్చి సెక్స్ క్రైం కథలతో అమాయక పాఠకుల్ని హత్య చెయ్యకండి.''

''....''

''ప్రేమ పెళ్ళి పేరుతో ఆడపిల్లలు ఇల్లు వదిలి పారిపో నక్కర్లేదు. ప్రేమించిన వాడ్ని రిజిస్టర్ పెళ్ళికి ఒప్పించమనండి. తల్లితండ్రిని అంగీకరించేలా చెయ్యమనండి. ఎక్కడికో పారిపోవడమెందుకు? ఉన్న ఊళ్ళోనే ధైర్యంగా బ్రతకలేరా? అని అడగండి. మైనారిటీ తీరిన ఏ ఆడపిల్లని మగపిల్లవాడ్ని కూడా చట్టంగాని, పోలీసులు గాని ఏమి చెయ్యలేరన్న సంగతి వాళ్ళకి తెలియదా. అని ప్రశ్నించండి!

''తెల్లని వన్ని పాలు అనుకునే లేత వయసు వార్ని'' మత్తు సాహిత్యంతో మభ్య పెట్టటం కాక వారికి విచక్షణ నేర్పండి.

''అంతేగాని...

''మీ కథలో అర్ధరాత్రి ప్రేమించిన వాడితో లేచిపోయి శ్రీవల్లి రెండు సంవత్సరాల తరువాత ఇంపాలా కారులో, ఒంటెడు నగలతో, పట్టు చీరతో పుట్టింటి గుమ్మంలో భర్తతో సహా కారుదిగి, పరిసరాల్ని జిగేల్ మనిపించిందని తన శపథం తీర్చుకుందని, కటిక పేదవాడ్ని చేసుకుని కట్టుబట్టలతో ఇల్లు వదిలి వెళ్ళి కోటికి పడగలెత్తి తిరిగి వచ్చిందని భ్రమలో కొట్టుకుపోతూ మాత్రం కథలు రాయకండి.

''... పత్రికలు ఆదర్శవంతంగా కథలు రాయమన్నాయేమో గాని తప్పుడు సాహిత్యంతో ఆరాచకాల్ని సృష్టించమనలేదు.'' అంటూ కాంతం రుసరుసలాడుతూ కాగితాల్ని భర్త ముఖం మీదికి విసిరి వంటగదిలోకి వెళ్ళిపోయింది. సుబ్రమణ్యం ఆలోచనలో పడ్డాడు.

□



## వృద్ధుల సేవలో జంపన లక్ష్మీ

ఆత్మీయులకు దూరంగా చూచే నాధులు లేని వృద్ధులను ఆదరించి వారికి ఎలాంటి లోటు లేకుండా చూడటానికి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణం సమీపంలోని చిన అమిరం గ్రామంలో ప్రశాంత వాతావరణంలో రాజరాజేశ్వరి వృద్ధుల సంక్షేమ సంఘం ఏర్పాటు చేసారు శ్రీమతి జంపన లక్ష్మి.

శ్రీమతి జంపన లక్ష్మి హైదరాబాద్‌లోని వృద్ధుల సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యురాలు. ఆంధ్ర ప్రదేశ్ మహిళా ఆర్థిక సంస్థ డైరెక్టరుగానూ, పశ్చిమ గోదావరి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సభ్యురాలిగా, పశ్చిమ గోదావరి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలిగా, పదవులను నిర్వహించారు.

దీనజన వృద్ధులలో నెలకొని వున్న నిరాశ నిస్పృహలను దూరం చేసి చివరి రోజుల్లో వారికి కనీస అవసరాలు సమకూర్చాలనే సంకల్పం, ఆశయంతో ఆమె ఈ సంఘం స్థాపించారు.

ఎల్. వెంకటరత్నం, నరసాపురం